క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం



డిపో మేనేజర్ సత్య నారాయణమూర్తి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్య నారాయణమూర్తి సోమవారం తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 95819 32678 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. అమలాపురం డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలికల వసతి గృహం సందర్శన



గొల్లవిల్లి బాలికల వసతి గృహంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీటీసీ సంపదరావు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజులు సోమవారం సందర్శించారు. వసతి గృహం పనితీరును పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతి గృహంలో తాగునీరు సక్రమంగా లేదని ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు జెడ్పీటీసీకు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సంపదరావు, సర్పంచ్ చిన్నవరాజు వసతి గృహంలో తయారుచేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ



క్రీడా సంబరాల్లో పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్

అమలాపురం రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 23వ తేదీ నుంచి 31 వరకూ వారం రోజుల పాటు జరుగుతున్న క్రీడా సంబరాల్లో భాగంగా సోమవారం స్థానిక బాలయోగి స్టేడియంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్ కుమార్ క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. వారం రోజుల పాటు వివిధ క్రీడలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు వంటెద్దు బాబి, మండేల బాబి, డాక్టర్ సురేష్, కానూరి అరవింద్, బూరగాయల శివ, నల్లా శివ, కోచ్ భీమేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుప్రసాద్‌కు సత్కారం



విష్ణుప్రసాద్‌ను సత్కరించిన సర్పంచ్ రాజారత్నం తదితరులు

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పీఈటీ ఉపాధ్యాయుడు పరమట విష్ణుప్రసాద్‌ను తన స్వగ్రామమైన వన్నెచింతలపూడిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రాజారత్నం, ఎంపీటీసీ పరమట నాగమణి, అగ్రికల్చర్ డైరెక్టర్ పరమట గంగా బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ పరమట మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 ఏపీ జట్టుకు విద్యార్థి ఎంపిక



ప్రసాద్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

అమలాపురం రూరల్: ది అమలాపురం కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వర్ధబండి బాలప్రసాద్‌రెడ్డి కడపలో జరిగిన అండర్-19 క్రికెట్ జట్టు సెలక్షన్స్‌లో ఏపీ జట్టుకు అర్హత సాధించాడు. గతంలో ఢిల్లీలో జరిగిన యంగ్ స్టార్ ప్రీమియం లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో 100 పరుగులు చేశాడు. అదే విధంగా హైదరాబాద్‌లో జరిగిన ఆర్ఎస్‌పీఎల్ లీగ్‌లో సత్తా చాటిన బాలప్రసాద్‌రెడ్డిను అండర్-19 ఏపీ టీమ్ సెలక్షన్స్‌కు ఎంపిక చేశారు. కర్ణాటకలో జరిగే ఐపీఎల్, ఎస్‌సీఎల్ జోనల్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాడు. సోమవారం ఆ కళాశాలలో బాలప్రసాద్‌రెడ్డిని డైరెక్టర్లు కిరణ్‌కుమార్, నాయుడు, సతీష్, ఎం.రాంబాబులు అభినందించారు.



మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి

కోల్‌కతా ఘటన తర్వాత మహిళా వైద్యులు, నర్సుల్లో మానసిక ఒత్తిడి, భయం చోటుచేసుకున్నాయి. ఆస్పత్రుల్లో రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులు, నర్సులకు ప్రత్యేక భద్రత కల్పించాలి. ఈ దిశగా ప్రభుత్వాలు సీరియస్‌గా ఆలోచించాలి. ఇలాంటి ఆటవిక, పాశవిక చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకు రావాలి. వైద్యులపై జరుగుతున్న దాడులను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తీవ్రంగా ఖండిస్తుంది.

– డాక్టర్ వెంపరాల గిరిజాకుమారి, అధ్యక్షురాలు, జిల్లా ఐఎంఏ మహిళా వైద్యుల విభాగం, అమలాపురం





చట్టాల్లో మార్పు తీసుకురావాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. రోగులకు వైద్యసేవలు అందించేందుకు వైద్యవృత్తిలో చేరిన మహిళలకు రక్షణ లేకుండా పోవడం దారుణం. దేశంలో వైద్యుల రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. నిందితులకు కఠినమైన శిక్షలు విధించేలా చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. న్యాయస్థానాలు ఈ కేసును ప్రత్యేకంగా తీసుకుని నిందితులకు త్వరితగతిన శిక్షను అమలు చేయాలి.

– డాక్టర్ యామిని, సీనియర్ మెడికల్ ఆఫీసర్, యానాం ప్రభుత్వ ఆసుపత్రి

ఈ-పంట.. సర్వర్‌తో తంటా

- ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15 వరకే అవకాశం
- ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో నమోదుకు ఆలస్యం
- సంక్షేమ పథకాలన్నింటికీ ప్రామాణికంగా ఈ-పంట



గూడాలలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: కాలానుగుణంగా రైతులు పండిస్తున్న పంట, వారి వివరాలను నమోదు చేసే ఈ-పంట నమోదు కార్యక్రమం నత్తనడకన సాగుతుంది. ఈ-పంట నమోదుకి సెప్టెంబర్ 15వ తేదీని గడువుగా నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు రైతు వేసిన పంట వివరాలు, రైతు ఖాతా, సర్వే నెంబర్, మొబైల్ ద్వారా ఈ-పంటను నమోదు చేసి జాతీయ స్థాయిలోని ఎన్ఐజీ(నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లోని సర్వర్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే జాతీయ స్థాయిలోని ఎన్ఐసీ సర్వర్ మొరాయిస్తుండడంతో నమోదు ఆలస్యమవుతోంది. వ్యవసాయ సహాయకులు సెలవు రోజుల్లో సైతం ఈ-పంట నమోదుకు ప్రయత్నిస్తున్నా సర్వర్ సహకరించకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదు సాధ్యమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈకేవైసీ మరింత ఆలస్యం

ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి వరి, కొబ్బరి, అరటి, ఖోఖో పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు చేపట్టారు. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ పంట కాలానికి 11,411 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. 11,900 ఎకరాల్లో కొబ్బరి పంట సాగుకు ఈ-పంట నమోదు చేయాల్సి ఉంది.

పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరాల నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్ల మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి ఈ-పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటారు. అయితే సర్వర్ సమస్య కారణంగా రైతుల ఈకేవైసీ మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఎన్ని సర్వే నెంబర్లకు ఈ-పంట నమోదు చేశారో అన్ని సర్వే నెంబర్లకు రైతుల ఈకేవైసీని అప్‌లోడ్ చేసి రైతు వేలిముద్రను తీసుకుని సబ్‌మిట్ చేస్తే ఈ-పంట నమోదు వంద శాతం పూర్తవుతుంది. అయితే ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో గడువులోగా రైతుల ఈకేవైసీ వంద శాతం నమోదు అవుతుందో లేదోనని అధికారుల్లో సైతం ఆందోళన నెలకొంది.

అమలాపురం నియోజకవర్గంలో ఈ-పంట నమోదు ప్రగతి సూచిక

మండలం	వరి సాగు (ఎకరాల్లో)	ఈ-పంట నమోదు పూర్తి	ఇంకా చేయాల్సింది
అల్లవరం	2,650	2,300	350
అమలాపురం	4,781	4,266	515
ఉప్పలగుప్తం	3,980	2,824	1,156

మండలం	కొబ్బరి సాగు (ఎకరాల్లో)	ఈ-పంట నమోదు పూర్తి	ఇంకా చేయాల్సింది
అల్లవరం	4,500	3,200	1,300
అమలాపురం	5,900	4,000	1,900
ఉప్పలగుప్తం	1,500	824	676

ఈ-పంట నమోదు చేశారు



భీమనపల్లి గ్రామంలో 3 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. వరి నాట్లు వేసిన తర్వాత వ్యవసాయ సహాయకులు మా పొలానికి వచ్చి ఈ-పంట నమోదు చేశారు. పంట విస్తీర్ణం, ఏ రకం తదితర వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

– ఇళ్ల కృష్ణ, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

గడువులోగా నమోదు పూర్తి చేస్తాం



ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఈ-పంటనే ప్రామాణికంగా తీసుకుంటారు. సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదు చేసి రైతుల ఈకేవైసీని అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అందుకే వ్యవసాయ సహాయకుల్ని సెలవు రోజుల్లో సైతం నమోదు ప్రక్రియకు పంపిస్తున్నాం. గడువులోగా నమోదు పూర్తి చేస్తాం.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి, అల్లవరం

వయోపరిమితి పెంచాలని నిరుద్యోగుల ధర్నా



ఆర్ఏఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగ యువకులు

యానాం: గ్రూప్-బీ, సీ తదితర నాన్ గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరి నిరుద్యోగ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం యానాం నిరుద్యోగ అభ్యర్థులు స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా చాలా ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ శిక్షణ సైతం తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో కరోనా వైరస్ కాలంలో నియామకాలు చేపట్టలేదన్నారు. అనంతరం వచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్లలో దరఖాస్తు చేసేందుకు తమ వయోపరిమితి దాటిపోయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్పందించి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో గ్రూప్-బీ, సీ పోస్టుల నియామకంలో వయోపరిమితిని పెంచి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లవరపు దయ, మున్నా, విజయ్, వీరి వినయ్, ధర్మశాస్త్ర, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. రహదారే..



నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్న యానాం బైపాస్ రహదారి

యానాం: యానాం బైపాస్ రహదారిలో భారీగా మురుగునీరు నిలిచిపోతుండడంతో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రహదారిలో ఇటు యానాం, అటు సుంకరపాలెం, ద్రాక్షారామ రహదారిలో భారీగా వర్షపునీటితో పాటు వివిధ హోటళ్ల నుంచి డ్రెయినేజీల్లోకి వదిలే నీరు సైతం రహదారిపైకి చేరుకుని ముంపునకు గురవుతుంది. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణ పనులు చేపట్టకపోవడం, నాలుగు లైన్ల రహదారి విస్తరణలో లోపాలే ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. బైపాస్ జంక్షన్ నుంచి అమలాపురం, రాజోలు, పామర్రు, కాకినాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న రహదారి మురికి కూపంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బొక్కు సొర చేపను పరిరక్షించుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీ అటవీ శాఖ అధికారులు

యానాం: సుమారు 65 కోట్ల సంవత్సరాల చరిత్ర గలిగి డైనోసార్లతో సముద్రజలాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన బొక్కు సొర చేపను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతియ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కోరింగ విభాగం ఆధ్వర్యంలో బొక్కుసొర దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బొక్కు సొర చేపను రక్షించేందుకు మత్స్యకారులు కృషి చేయాలన్నారు. వలలకు చిక్కితే దాన్ని ఎట్టి పరిస్థితుల్లో చంప వద్దని, తిరిగి దాన్ని సముద్రంలోనే వదిలిపెట్టాలని సూచించారు. అటవీశాఖ కోరింగ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు మాట్లాడుతూ తిమింగలానికి నాలుగు రెట్లు అధికంగా ఉండే వేల్ సార్క్, బొక్కుసొర ఎవరికీ హాని తలపెట్టవన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.ధనుంజయ, గోపి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు గ్రహించకుండా విమర్శలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా జేఏసీ నాయకులు

అమలాపురం టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వాస్తవాలను గ్రహించకుండా మాలలపై విమర్శలు చేయడం తగదని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉండ్రు బాబ్జి, ఎంఏకే భీమారావు, పండు అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక సూర్యనగర్‌లో సోమవారం సాయంత్రం మాలమహానాడు జిల్లా జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాలలు మనువాదులని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈనెల 21న జరిగిన భారత్ బంద్‌కు సహకరించిన జిల్లాలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వర్తక సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాతి శ్రీనివాసరావు, పెయ్యల పరశురాముడు, గూటం సాయి, జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నయ్యల సందడి.. గోపెమ్మల అల్లరి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సమనసలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



ఐ.పోలవరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



అమలాపురంలో చిన్నికృష్ణుడు, రాధా గోపికల వేషధారణల్లో చిన్నారులు

తాళ్లరేవు: చిన్నికృష్ణుల చిలిపి సందడి, గోపెమ్మల అల్లర్లతో ఊరూవాడా సందడిగా మారాయి. పవిత్ర కృష్ణాష్టమి వేడుకలు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు రచ్చవారిపేటలో గోపాలకృష్ణుని ఆలయంలో సోమవారం ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా పలు ఆలయాల వద్ద చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి సందడి చేశారు.

అమలాపురం టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్థానిక ఓం శాంతి కేంద్రం భవనంలో బ్రహ్మకుమారీలు సోమవారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో ఆబాలగోపాలం అలరించింది. బాలబాలికలు చిన్న కృష్ణుడు, రాధా గోపికల వేషధారణలతో నంద గోపాలకుడి పండుగను కన్నుల పండువగా నిర్వహించారు. ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక రవణం మల్లయ్య వీధిలోని రామాలయం వద్ద సోమవారం రాత్రి జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో వందలాది మంది స్థానికులు పాల్గొని సందడి చేశారు.

అమలాపురం రూరల్: జనుపల్లిలో ఇస్కాన్ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ కేటగిరిలో పోటీలు నిర్వహించి ఇస్కాన్ చైర్మన్ శివానంద నిమయి దాస్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే ఉత్సవం వైభవంగా సాగింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మెట్ల రమణబాబు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరావు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, పీఈటీ శేరు విష్ణుమూర్తి, హెచ్ఎం పి.రాజారామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణల పోటీలు నిర్వహించారు.

ముమ్మిడివరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిరంజీవి ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం, కేశనకుర్రు, పశువుల్లంక, జి.వేమవరం, జి.మూలపాలెం గ్రామాల్లో ఉన్న శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను, ఆలయాలను పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అల్లవరం: దేవగుప్తంలోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని ఆలయంలో నూని రాముడు దంపతులచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో బాలల ఉత్సాహంగా పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విజేతలతో ఇస్కాన్ ప్రతినిధులు



తాళ్లరేవులో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

విద్యుత్ స్తంభం ఏర్పాటు



పేరూరులో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు ఇందిరా నగర్ కాలనీలో పడిపోయిన విద్యుత్ స్తంభం శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ అమలాపురం డివిజినల్ ఈఈ మోకా రవికుమార్, ఏఈలు విద్యుత్ స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సోమవారం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను సరిచేశారు. స్థానికంగా ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన సాక్షి దినపత్రికకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరి జాతీయ సదస్సును విజయవంతం చేయండి



మురమళ్లలో జరిగిన బీకేఎస్ సమావేశం

ఐ.పోలవరం: అఖిల భారత కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జరిగే జాతీయ కొబ్బరి సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి జలగం కుమారస్వామి కోరారు. మండలం పరిధిలో మురమళ్లలో సోమవారం జరిగిన మండల స్థాయి కొబ్బరి రైతుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీ ప్రాంగణం వద్ద ఉదయం 10 గంటలకు అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు జరుగుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, కొండబాబు, వేగేసిన సూర్యనారాయణరాజు, జంపన భీమరాజు, రాయపురెడ్డి స్వామినాయుడు, రాచకొండ మాణిక్యాలరావు, వట్టూరి రాంబాబు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాకు ఘన నివాళి



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు

ఐ.పోలవరం: నోబెల్ బహుమతి గ్రహీత, దివంగత మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి భూపతిరాజు సుభద్రరాజు (చంటిబాబు) ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పీవీఎస్ వర్మ, నంబూరి సీతారామరాజు, నంబూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవ సన్మార్గ నిర్దేశకుడు శ్రీకృష్ణ పరమాత్ముడే



కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు

అమలాపురం టౌన్: శ్రీకృష్ణుడు మానవ సన్మార్గ నిర్దేశకుడని అమలాపురం సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి వారి అగ్రహారంలో ఆ ఆరోగ్య సేవా సంస్థ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నానిరాజు ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, శ్రీపాద రామకృష్ణ పాల్గొన్నారు.